

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

గురువారం | 23 | జులై | 2026 • పేజీలు : 8


## రామాలయ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- అధికారులకు ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు



భద్రాచలం టౌన్ , జూలై 22 (సాక్ష్యం)

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాభివృద్ధి పనులను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో

మిగతా 2 లో...




# స్త్రీ నిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- రెండు నెలల్లో 60 శాతం రికవరీ లక్ష్యంగా కార్యాచరణ చేపట్టాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్ , జూలై 22 (సాక్ష్యం):

జిల్లాలో స్త్రీ నిధి రుణాల వసూళ్లను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, వచ్చే రెండు నెలల్లో కనీసం 60 శాతం రికవరీ సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి స్త్రీ నిధి సమీక్ష కమిటీ సమావేశంలో స్త్రీ నిధి ఉప ప్రధాన నిర్వాహకుడు శ్రీకాంత్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాచందనతో కలిసి జిల్లాలో రుణాల వసూళ్లు, పెండింగ్ బకాయిలు, మండలాల వారీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్షించారు. రికవరీ శాతం తక్కువగా ఉన్న మండలాల సహాయ ప్రాజెక్టు నిర్వాహకులు, మండల సమాఖ్య అధ్యక్షులను జిల్లా కలెక్టర్ నేరుగా వివరణ కోరారు. రికవరీలో వెనుకబడడానికి గల కారణాలను విశ్లేషించి, ఆయా మండలాలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి క్షేత్రస్థాయిలో

మిగతా 2 లో...

## గిరిజన గ్రామంలో నూతన పాఠశాల భవనం ప్రారంభం

- బక్కచింతలపాడులో పోలీసుల సేవా కార్యక్రమం.. పాఠశాలను ప్రారంభించిన ఎస్పీ రోహిత్ రాజు



చర్ల, జూలై 22 (సాక్ష్యం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామంలో చర్ల పోలీసుల ఆధ్వర్యంలో నిర్మించిన నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, ఐపీఎస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, పలకలు పంపిణీ చేసి, ఉపాధ్యాయులు, గ్రామస్థులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విద్య ప్రతి చిన్నారి భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులు కూడా నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, క్రమశిక్షణ, విద్యార్థుల నైతిక విలువలు, హాజరు శాతం పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, వారి ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, యోగా,

మిగతా 2 లో...

## దేవస్థానం నిత్యన్నదాన సత్రం వద్ద శిశువును వదిలివెళ్లిన వ్యక్తి

- శిశుగృహకు తరలించిన ఆటో డ్రైవర్లు
- కేసు నమోదు చేసిన భద్రాచలం పోలీసులు



భద్రాచలం, జూలై 22(సాక్ష్యం):

భద్రాచలంలోని దేవస్థానం నిత్యన్నదాన సత్రం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆకుల నారాయణ అనే వ్యక్తి చెట్టు కింద కూర్చొని ఉండగా ఆడ శిశువును మీ వద్ద ఉంచండి లోపలికెళ్లి అన్నం తిని వస్తా అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అనంతరం అతని కోసం రామాలయ పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సమీపంలో ఉన్న ఆటో డ్రైవర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే శిశువును ఆకుల నారాయణ, ఆటో డ్రైవర్లు శిశు గృహకు తరలించారు. అనంతరం శిశువుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘటన విషయం తెలుసుకున్న న్యాయాధికారి రాజశేఖర్ శిశుగృహకు వెళ్లి నారాయణ వద్ద వివరాలు సేకరించారు. కాగా శిశువును వదిలి వెళ్లిన వ్యక్తి గురించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## లక్ష్యాన్ని పెట్టుకుని సాధించేందుకు కష్టపడదాం

- గిరిజన యువతకు విద్య ఉపాధి నైపుణ్యాభివృద్ధి అంటే రంగాల్లో అవకాశాలు
- గిరిజన ప్రాంతాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి... ఎమ్మెల్యే..జారే ఆదినారాయణ
- ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు.
- మీలో బలాలు లోపాలు గుర్తించి మెరుగుపరుచుకునేందుకు కృషి చేయాలి.....రాహుల్... ప్రాజెక్టు అధికారి.. ఐ టి డి ఏ




అశ్వారావుపేట, జూలై 22, సాక్ష్యం :

లక్ష్యసాధనకు కష్టపడితే గిరిజన యువతకు ఉజ్జ్వల భవిష్యత్తు ఉంటుందని, నిర్దేశిత లక్ష్యాలను పెట్టుకుని, వాటిని సాధించేందుకు నిజాయితీతో కష్టపడితే భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉంటుందని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) రాహుల్ అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన యువత కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం వారు ప్రారంభించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం గిరిజన యువతలో దాగివున్న ప్రతిభను వెలికితీసి, ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. గిరిజన యువతీ యువకులు విద్య,

మిగతా 2 లో...

## రామాలయ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

జరుగుతున్న పనుల పురోగతిని కాంట్రాక్టర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి దామోదర్‌రావు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామంలో నూతన పాఠశాల భవనం ప్రారంభం





(మొదటి పేజీ తరువాయి...)

సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని, వాటి ద్వారా ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందుతాయని పేర్కొన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు మూఢనమ్మకాలను ఆశ్రయించకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలకు శాస్త్రీయ వైద్య చికిత్సే సరైన పరిష్కారమని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని, గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు అవసరమైన టీకాలు పూర్తిగా వేయించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. అలాగే రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ప్రత్యేక శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ, మండల విద్యాశాఖ అధికారి రమణ, కాంట్రాక్టర్ సంతోష్, సర్పంచ్ లక్ష్మి , ఉపాధ్యాయురాలు సౌజన్య, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్త్రీ నిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి...)

అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణాల వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని, మండలాల వారీగా పెండింగ్ బకాయిలు అధికంగా ఉన్నాయని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలో రికవరీ శాతం కేవలం 13.5 శాతం మాత్రమే ఉండగా, రాష్ట్రంలో జిల్లా 31వ స్థానంలో ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 239 గ్రామ సమాఖ్యల్లో సున్నా వసూళ్లు నమోదయ్యాయని తెలిపారు. ముఖ్యంగా భద్రాచలం, పాల్వంచ, ఇల్లందు, అశ్వరావుపేట ప్రాంతాల్లో రికవరీ శాతం అత్యల్పంగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి రుణగ్రహీతలను కలిసి అవగాహన కల్పించాలని, బకాయిలు ఉన్న ప్రతి మహిళా



సంఘాన్ని గుర్తించి రుణాల సకాల చెల్లింపుపై సభ్యులకు చైతన్యం కల్పిస్తూ వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. వచ్చే రెండు నెలల్లో కనీసం 60 శాతం రికవరీ సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, ప్రతి రోజు మండల స్థాయిలో వసూళ్ల పురోగతిపై నివేదికలు సమర్పించాలని సూచించారు. రోజువారీ సమీక్షల ద్వారా లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని, మెరుగైన పనితీరు కనబరిచిన మండలాలను అభినందిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై బాధ్యత నిర్ధారిస్తామని హెచ్చరించారు. స్త్రీ నిధి ఉప ప్రధాన నిర్వాహకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ, రుణాల వసూళ్ల పెంపు ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతగా భావించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా ప్రత్యేక రికవరీ ప్రణాళికలు రూపొందించి, మహిళా సంఘాల సభ్యులను వ్యక్తిగతంగా కలిసి రుణాల చెల్లింపుపై అవగాహన కల్పించాలని, అవసరమైతే ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. సకాలంలో రుణాలు చెల్లించే మహిళా సంఘాలను ప్రోత్సహించడంతో పాటు, బకాయిలు ఉన్న సంఘాలకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. రుణాల సకాల చెల్లింపు వల్ల మహిళా సంఘాల ఆర్థిక విశ్వసనీయత పెరిగి, భవిష్యత్తులో మరింత అధిక మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రామ సమాఖ్య భవనాల పురోగతి, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల స్థాపన తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి నీలేష్, సంబంధిత శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, మండల సమాఖ్య అధ్యక్షులు, గ్రామ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని పెట్టుకుని సాధించేందుకు కష్టపడదాం

(మొదటి పేజీ తరువాయి...)

ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో వస్తున్న ఈ అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, మన జీవితంలో ప్రతిరోజూ ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉండాలని నేర్చుకున్న నైపుణ్యాలను ఆచరణలో పెట్టినప్పుడే విజయం సాధించగలమన్నారు. గిరిజన ప్రాంతాల నుంచి ఎంతోమంది విద్యార్థులు ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్నారని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా సమర్థవంతంగా అమలు చేస్తూ, గిరిజన సంక్షేమ రంగంలో ఉత్తమ సేవా అవార్డులు పొందిన అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. గిరిజన విద్యార్థులకు చిన్న వయసు నుంచే చదవడం, రాయడం వంటి పునాది నైపుణ్యాలను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.

- **మీలోబలాలు, లోపాలు గుర్తించి మెరుగుపరుచుకునేందుకు కృషి చేయాలి....ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్**

గిరిజన యువత తమలోని బలాలు, బలహీనతలను గుర్తించి, లోపాలను మెరుగుపరుచుకునేందుకు నిరంతరం కృషి చేయాలని, ఈ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన వారికి అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఐటిడిఏ రాహుల్ అన్నారు. ఉద్యోగం అనేది మనకు నచ్చిన ప్రదేశంలో కాకుండా, లభించిన ప్రదేశంలోనే బాధ్యతాయుతంగా చేస్తే మనపై మనకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మార్గదర్శనం చేశారు. రెండు మూడు సంవత్సరాలు నిబద్ధతతో కష్టపడితే గిరిజన యువత భవిష్యత్తు బంగారుమయమవుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు, శిక్షణ పొందుతున్న గిరిజన యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యాన పంటలకు ఎల్‌నినో ఎఫెక్ట్

- **దశలవారీగా పంటలు నాటండి**
- **వర్షపాతం లోటు ఉద్యానవన పంటల సాగుపై ప్రభావం చూపుతుంది... డా..మజ్జిగ శ్రీనివాస్....ఉద్యానవన పరిశోధన హెడ్**





అశ్వారావుపేట, జూలై 22,సాక్ష్యం : ప్రస్తుత వానాకాలంలో వర్షపాత లోటు ఈ ప్రాంత ఉద్యాన పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అశ్వారావుపేట ఉద్యాన పరిశోధనా స్థానం హెడ్, శాస్త్రవేత్త డా. మజ్జిగ శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 1 నుంచి జులై 15 వరకు రాష్ట్రంలో సాధారణంగా 229.1 మి.మీ. వర్షపాతం నమోదు కావలసి ఉండగా, కేవలం 154 మి.మీ. మాత్రమే కురిసిందని, దీంతో 33 శాతం వర్షపాత లోటు నమోదైందని తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 26 జిల్లాలు లోటు వర్షపాతం, 4 జిల్లాలు తీవ్ర లోటు వర్షపాతం పరిధిలో ఉన్నాయని, కేవలం 3 జిల్లాల్లోనే సాధారణ వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. వర్షాల మధ్య సుదీర్ఘ విరామం వల్ల నేలలో తేమ వేగంగా తగ్గి కూరగాయలు, పండ్లతోటలు, పూలు, ఆయిల్ పామ్, కొబ్బరి తదితర పంటలకు నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ నీటి ఒత్తిడి వల్ల పూత, పిందె రాలడం, పండ్ల పరిమాణం తగ్గడం లాంటి సమస్యలు వస్తాయని, వీటిని అధిగమించడానికి ఉద్యాన రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

- **తీసుకోవాల్సిన**

### ముందస్తు జాగ్రత్తలు

నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మిరప, వంగ, బెండ, బీర, కాకర, సొర, చిక్కుడు వంటి కూరగాయలను డ్రిప్ పద్ధతిలోనేసాగు చేయాలని, ఒకేసారి కాకుండా దశలవారీగా పంటలు నాటుకోవడం వల్ల నీటి అవసరంతో పాటు మార్కెట్ నష్టభయాన్ని కూడా తగ్గించుకోవచ్చన్నారు. మామిడి, జామ, నిమ్మ, సపోటా వంటి పండ్ల తోటలలో పాదుల చుట్టూ ఎండిన ఆకులు, వరి గడ్డి లేదా సేంద్రియ వ్యర్థాలతో మల్చింగ్ (కప్పడం) చేయాలని,ఇది నీరు ఆవిరి కాకుండా తేమను కాపాడుతుందన్నారు. నీరు, పోషకాల కోసం పోటీ పడే కలుపు మొక్కలను సకాలంలో తొలగించాలన్నారు. ఆయిల్ ఫామ్ అధిక దిగుబడి ఇచ్చే ఉద్యానవన పంటని అందుబాటులో ఉన్న నీటిని క్రమం తప్పకుండా ప్రతిరోజు అందించి నీటి ఎద్దడి లేకుండా పంటను సంరక్షించుకోవాలన్నారు. ఆయిల్ పామ్‌కు నీటిఎద్దడి ఏర్పడితే ఆడ పుష్పాల ఉత్పత్తి తగ్గి నూనె దిగుబడిపై దీర్ఘకాలిక ప్రభావం పడుతుంది. అందువల్ల అందుబాటులో ఉన్న నీటిని ప్రతిరోజూ క్రమం తప్పకుండా అందించాలని అప్పుడే మంచి ప్రయోజనం ఉంటుందన్నారు. వర్షం కురిసినప్పుడు వచ్చే ప్రవాహపు నీటిని ఫార్మ్ పాండ్లు (రైతు కుంటలు), ఇంకుడు గుంతల్లో సంరక్షించి, వర్షాలు లేని సమయంలో పంటలకు జీవనాధార నీటిపారుదలగా ఉపయోగించాలని, డ్రిప్ వ్యవస్థలోని లీకేజీలు, మూసుకుపోయిన డ్రిప్పర్లను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలన్నారు. ఎల్‌నినో పరిస్థితులను తట్టుకోవడానికి రైతులు శాస్త్రీయ పంటల ఎంపిక, డ్రిప్ పద్ధతి, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ విధానాలను పాటించాలని, ప్రతీ నీటి చుక్కనూ సద్వినియోగం చేసుకోవడం ద్వారానే పంట నష్టాన్ని నివారించి ఆదాయాన్ని కాపాడుకోగలరన్నారు

# మై భారత్ పోర్టల్‌లో ప్రతి విద్యార్థి నమోదు కావాలి

- జిల్లా స్థాయిలో యువ పార్లమెంట్ నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేయాలి
- అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్




కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 22 (సాక్ష్యం):

కేంద్ర ప్రభుత్వం యువత కోసం రూపొందించిన మై భారత్ పోర్టల్ ద్వారా లభించే అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, స్వచ్ఛంద సేవ, నాయకత్వ వికాసం తదితర రంగాల్లో విస్తృత అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు తొమ్మిది వేల మంది యువత ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ప్రత్యేక నమోదు కార్యక్రమాలు చేపట్టి ఈ సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.జిల్లాలోని ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, వైద్య, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జాతీయ కేడెట్ దళం, జాతీయ సేవా పథకం విద్యార్థులను కూడా తప్పనిసరిగా నమోదు చేయించాలని సూచించారు.జిల్లా స్థాయిలో యువ పార్లమెంట్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయాలని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన యువతకు భారత పార్లమెంట్‌లో పాల్గొనే అరుదైన అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.వికసిత్ భారత్ కార్యక్రమంలో నిర్వహించే విజ్ఞాన పోటీల్లో విజేతలకు దేశ సరిహద్దు రాష్ట్రాల పర్యటనతో పాటు కొన్ని ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రధానమంత్రిని కలిసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాలపై యువతలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం తదితర ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో విజేతలైన వారికి కేంద్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా యువజన అధికారి వెంకట్రామ్ బాబు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి , జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి వసంత, జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రధాన నిర్వాహకుడు మధుసూదన్ రెడ్డి, జాతీయ సేవా పథకం జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ కామేశ్వరరావు, అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాశరథి జయంతి వేడుకలు



భద్రాచలం టౌన్, జూలై 22 (సాక్ష్యం)

భద్రాచలం డిగ్రీ కళాశాల అటానమస్ లో దాశరథి జయంతి వేడుకలు బుధవారం కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ హవీలా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థుల సమక్షంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిజాం ప్రభుత్వంకు వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో అనేక రచనలు చేసినటువంటి దాశరథి మహాకవి అని కొనియాడారు. అనంతరం తెలుగు విభాగాధిపతి డాక్టర్ కపిలభారతి మాట్లాడుతూ దాశరథి రచనలను, వారి కవితా వైభవాన్ని, ఉద్యమస్ఫూర్తిని, గజల్స్, తెలంగాణ ఉద్యమానికి దాశరథి రచనలు , కవిత్వం తెలంగాణ ప్రజానీకాన్నిఎంత చైతన్యవంతం చేశాయో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ నందూరి రాంబాబు అధ్యాపక బృందం డాక్టర్ నాగసమీర, డాక్టర్ కిరణ్ కుమార్ లతోపాటు కళాశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డు ఫలితాలు పునఃసమీక్షించాలి

- అనారోగ్య కార్మికులకు న్యాయం చేయాలని ఎఐటీయూసీ ఆందోళన

ఇల్లందు, జూలై 20 (సాక్ష్యం):

సింగరేణి కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలను పునఃసమీక్షించి అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఐటీయూసీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఇల్లందు ఏరియాలోని కేఓసీ, జేకేఓసీ–5, ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్, ఎస్&పీసీ, ఏరియా సివిల్ విభాగాల వద్ద కార్మికులు పెద్దఎత్తున ధర్నాలు నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన కార్యక్రమంలో ఎఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎం.డి. నజీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 2,000 మంది కార్మికులు ఏళ్ల తరబడి కార్పొరేట్ మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తుండగా, కేవలం 120 మందికే బోర్డు నిర్వహించడం తీవ్ర అన్యాయమని విమర్శించారు.మెడికల్ బోర్డుకు హాజరు కావాల్సిన 28 మంది కార్మికులకు సకాలంలో సమాచారం అందకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. హాజరైన 120 మందిలో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్‌కు అర్హులుగా ప్రకటించడం గతంలో జరిగిన మెడికల్ బోర్డులతో పోలిస్తే అత్యంత తక్కువ శాతమని పేర్కొన్నారు. బొగ్గు గనుల్లో, ముఖ్యంగా భూగర్భ గనుల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులు కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, వాటిని సమగ్రంగా పరిగణనలోకి తీసుకోకుండా ఫలితాలు ప్రకటించడం వల్ల నిజమైన బాధితులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో దరఖాస్తు చేసుకుని ఇప్పటికీ మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికులందరికీ మరోసారి కార్పొరేట్ మెడికల్ బోర్డును నిర్వహించాలని, ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని నిష్పాక్షికంగా పరిశీలించి అర్హులైన వారిని ఇన్వాలిడేషన్ కు ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శులు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, వి. జయరాజు, జక్కుల శ్రీనివాస్, దాట్ల వెంకటేశ్వర్లు, పి. యుగేందర్, మంగపతిరావు, కలవల సిద్ధార్థ్, విజయ్ శ్రీనివాస్, గుగులోత్ కృష్ణ, చెరుకు సారయ్య, రావుజీ, బట్టు రవి, కొంటు వీరస్వామి, అమ్మ ఆంజనేయులు, గుగులోత్ లక్ష్మణ్, నందకుమార్, ఆర్.ఎల్. విష్ణువర్ధన్, నిఖిల్ కుమార్ సాహూ, నగేష్, మహేష్, సోలెం వెంకటేశ్వర్లు, మేఘరాజు, స్వరూప, గుగులోత్ సోని, లక్ష్మి , సంధ్యారాణి, సింధు తదితరులు పాల్గొన్నారు.






## ఎల్-నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

- పంటల మార్పిడితో నష్టాలు తగ్గించి ఆదాయం పెంచుకోవాలి : జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు




కొత్తగూడెం, జూలై 22 (సాక్ష్యం):

ఎల్–నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సూచించారు.బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి దీపక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోరు నీటిపై ఆధారపడి విస్తృతంగా వరి సాగు చేయడం వల్ల నీటి కొరత ఏర్పడి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల రైతులు ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, మొక్కజొన్న, జొన్న, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం లభిస్తుందని, మొక్కజొన్న, జొన్న, పప్పుధాన్యాలు తక్కువ నీటితో సాగవడంతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంటలని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ వల్ల భూసారం మెరుగుపడటంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.ఎల్–నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు, అవసరమైన సలహాలు అందిస్తారని చెప్పారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ విధానాల్లో సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించడంతో పాటు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపక్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై కాంగ్రెస్ ఆందోళన.. ఇల్లందులో రాస్తారోకో




ఇల్లందు, జూలై 22 (సాక్ష్యం):

నీట్ పరీక్ష పత్రాల లీకేజీ ఘటనపై దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న నిరసనలకు మద్దతుగా, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో బుధవారం బుగ్గవాగు వంతెనపై కాంగ్రెస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష పత్రాల లీకేజీ, విద్యార్థుల ఆత్మహత్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న యువతపై కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జ్ చేయడం, అక్రమ అరెస్టులకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని అన్నారు. దేశ యువత భవిష్యత్తుతో చెలగాటమాడిన కేంద్ర ప్రభుత్వం దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.నీట్ పరీక్షలో జరిగిన అవకతవకల నేపథ్యంలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. యువతకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నివాసం వద్ద నిరసన వ్యక్తం చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.పెట్టుబడిదారుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ, దేశ యువత సమస్యలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని ఆరోపించారు. దేశ యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్, సొసైటీ చైర్మన్ మెట్ల రామకృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు జీవీ భద్రం, మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు పులి సైదులు, దొడ్డా డేనియల్, బయ్యారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గాలి స్వరూప, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 24న పాల్వంచలో ఫుడ్ లైసెన్స్ మేళా


- ఆహార వ్యాపారులు అవకాశాన్ని వినియోగించుకోవాలి
- జిల్లా ఆహార భద్రత అధికారి ఈ. శరత్

పాల్వంచ, జూలై 22 (సాక్ష్యం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ (శుక్రవారం) పాల్వంచలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఆహార భద్రత అధికారి ఈ. శరత్ తెలిపారు.జిల్లా పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, బేకరీలు, కిరాణా దుకాణాలు, పాలు, పాల ఉత్పత్తుల వ్యాపారులు, ఇతర ఆహార వ్యాపార సంస్థల యజమానులు ఈ మేళాకు హాజరై కొత్త ఆహార లైసెన్స్, నమోదు, లైసెన్స్ పునరుద్ధరణ, సవరణలు తదితర సేవలను పొందవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆహార వ్యాపారులకు ఆయన ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. 'తత్కాల్ ఫుడ్ లైసెన్స్' పేరుతో ఎవరూ దరఖాస్తు చేయవద్దని, అలాగే అలాంటి పేరుతో ఎవరికి అదనపు రుసుములు చెల్లించవద్దని సూచించారు. ఆహార లైసెన్స్ పొందేందుకు ప్రభుత్వం నిర్దేశించిన సాధారణ విధానమే అమలులో ఉందని, ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా అధికారిక విధానంలోనే సేవలు పొందాలని కోరారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫుడ్ లైసెన్స్ మేళాను ఆహార వ్యాపారులందరూ సద్వినియోగం చేసుకుని తమ లైసెన్సులకు సంబంధించిన సేవలను ఒకే వేదికపై పొందాలని జిల్లా ఆహార భద్రత అధికారి ఈ. శరత్ విజ్ఞప్తి చేశారు.

## గిరిజన హక్కుల కోసం రాజీలేని పోరాటాలు

- టీజీఎస్ రాష్ట్ర మహాసభలు విజయవంతం
- తీర్మానాల అమలుకు దశలవారీ ఉద్యమాలు
- 13 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక..
- కల్లూరి వెంకటేశ్వరరావు, రమావత్ అంజయ్య నాయక్ వెల్లడి






పాల్వంచ, జూలై 22 (సాక్ష్యం)

గిరిజనుల భూమి, భుక్తి, ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ఇకపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ గిరిజన సమాఖ్య (టీజీఎస్) రాష్ట్ర నాయకత్వం స్పష్టం చేసింది. ఇటీవల పాల్వంచలో నిర్వహించిన టీజీఎస్ రాష్ట్ర మూడో మహాసభల్లో ఆమోదించిన తీర్మానాల అమలుకు దశలవారీ ఉద్యమాలు చేపడతామని ప్రకటించింది. పాల్వంచ పట్టణంలోని సీపీఐ కార్యాలయం సీఆర్ భవన్లో బుధవారం నిర్వహించిన టీజీఎస్ నూతన రాష్ట్ర కార్యవర్గ తొలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర మహాసభల్లో ఎన్నికైన 25 మంది కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో 13 మందితో కూడిన నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కల్లూరి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా అజ్మీర రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శిగా రమావత్ అంజయ్య నాయక్, ఉపాధ్యక్షులుగా వడిత్య స్వరూపా, సొందే కుటుంబరావు, మూడ్ గణేష్, రమావత్ సక్రు, సహాయ కార్యదర్శులుగా జువారి రమేష్, భూక్య శ్రీనివాస్, రాజారాం, వీరు నాయక్, కోశాధికారిగా నేనావత్ రూప్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర మూడో మహాసభలు ఘనవిజయం సాధించాయని తెలిపారు. వివిధ జిల్లాల నుంచి 173 మంది ప్రతినిధులు మహాసభల్లో పాల్గొన్నారని తొలి రోజు నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభకు సుమారు 5,700 మంది గిరిజనులు హాజరై విజయవంతం చేశారని పేర్కొన్నారు. మహాసభల్లో ఆమోదించిన తీర్మానాలను అమలు చేయించేందుకు రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఉద్యమాలు చేపడతామని గిరిజనుల హక్కుల సాధన కోసం సమాఖ్య ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.



## ఏకలవ్య పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలి

- విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి : జిల్లా కలెక్టర్ అంకిత్







కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 22 (సాక్ష్యం):

జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, ఆరోగ్య సేవలు, సురక్షిత వాతావరణం కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ అంకిత్ అధ్యక్షత వహించి టేకులపల్లి, ములకలపల్లి, దుమ్ముగూడెం, గండుగులపల్లి, గుండాల, చర్ల, పాల్వంచ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరు, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్య సేవలు, తాగునీటి సౌకర్యం, క్రీడా మైదానాలు, డిజిటల్ విద్య తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ఏకలవ్య పాఠశాలలు కీలకమని పేర్కొన్నారు. జాతీయ గిరిజన విద్యా సంస్థ మార్గదర్శకాల మేరకు అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు, వార్షిక ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక ఆరోగ్య పరీక్షల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని, ప్రతి పాఠశాలకు పార్ట్‌టైమ్ వైద్యుడిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా అన్ని ఏకలవ్య పాఠశాలల్లో శుద్ధి చేసిన తాగునీటి యంత్రాలతో కూడిన వాటర్ కూలర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దుమ్ముగూడెం, చర్ల పాఠశాలలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి కనెక్షన్లు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి పాఠశాలలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేసి క్రమం తప్పకుండా క్రీడా పోటీలు నిర్వహించాలని ఆదేశించారు.గండుగులపల్లి ఏకలవ్య పాఠశాలలో అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని, పాఠశాల విస్తరణకు అవసరమైన అదనపు భూమి అంశాన్ని పరిశీలించాలని ఐటీడీఏ అధికారులకు సూచించారు.అన్ని పాఠశాలల్లో డిజిటల్ విద్యను బలోపేతం చేసేందుకు అధిక వేగం గల అంతర్జాల సౌకర్యం కల్పించాలని, కంప్యూటర్ ప్రయోగశాలలను ఆధునీకరించి అవసరమైన కంప్యూటర్లు, ఇతర పరికరాలు సమకూర్చాలని ఆదేశించారు.విద్యార్థులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, కొన్ని పాఠశాలల్లో మెనూ అమలులో లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ఇకపై ప్రతి పాఠశాలలో నిబంధనల ప్రకారం ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన చోట అల్పాహారంలో చపాతీలు అందించేందుకు చపాతీ తయారీ యంత్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.పాఠశాల ఆవరణలను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దాలని, మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. తల్లిదండ్రుల కోసం నిరీక్షణ షెడ్లు, అతిథి గృహాల సౌకర్యాలు, విద్యుత్ సరఫరా మెరుగుదల, అంతర్గత రహదారులు, భద్రతా చర్యలు తదితర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు ఏకలవ్య పాఠశాలలు బలమైన పునాదిగా నిలవాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్య సేవలు, ఆధునిక మౌలిక వసతులు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వాహణాధికారి నాగలక్ష్మి , గిరిజన సంక్షేమ ప్రాంతీయ సమన్వయ అధికారి అరుణకుమారి, భద్రాచలం పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ పాఠశాల ప్రిన్సిపాల్, ఏకలవ్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

- ప్రాపర్టీ కేసుల ఛేదన వేగవంతం చేయాలి..
- రౌడీషీటర్లపై నిరంతర నిఘా : రోహిత్ రాజు








దుమ్ముగూడెం, జూలై 22 (సాక్ష్యం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, ఐపీఎస్ బుధవారం దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటప్పయ్య పుష్పగుచ్ఛం అందజేసి ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలు, కార్యాలయ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ఆయుధాగారం, మాల్ఖానా, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, నేర నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ప్రాపర్టీ కేసుల ఛేదనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దొంగిలించబడిన ఆస్తులను త్వరితగతిన స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించేలా దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు.రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థలో నమోదయ్యే కేసులు, దర్యాప్తు పురోగతి, ఇతర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, మట్కా, జూదం, కోడి పందాలు, పేకాట, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి త్వరితగతిన సేవలు అందించాలని సూచించారు.అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య, ప్రత్యేక శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్ఐలు శ్యాంప్రసాద్, జగన్మోహన్ చారి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సర్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి

- **సీతారామ కాలువ భూ సేకరణ పనులపై కలెక్టర్ అంకిత్ సమీక్ష**
- **గిరిజన బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ**





జూలూరుపాడు, జూలై 22 (సాక్ష్యం):

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువకు సంబంధించిన భూ సేకరణ సర్వే పనులను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బుధవారం జూలూరుపాడు మండలంలో కొనసాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువకు సంబంధించిన భూ సేకరణ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పురోగతిపై రెవెన్యూ, సాగునీటి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, పనుల్లో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.జూలూరుపాడు గ్రామ పరిధిలో మొత్తం 17 ఎకరాల 20 కుంటల భూమికి సర్వే నిర్వహించాల్సి ఉందని, అందులో సుమారు 8 ఎకరాలు అటవీ హక్కుల చట్టం కింద మంజూరైన పట్టా భూములు ఉన్నట్లు అధికారులు వివరించారు. అనంతరం కొత్తూరు గ్రామంలో కొనసాగుతున్న సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, అక్కడ మొత్తం 337 ఎకరాల భూమికి సర్వే చేపట్టాల్సి ఉందని తెలుసుకుని, పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఆదేశించారు.భూ సర్వేలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా రెవెన్యూ, సాగునీటి శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రతి దశను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సర్వేకు అవసరమైన మార్కింగ్ పనులను ఒకే రోజులో పూర్తి చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా స్థానిక రైతులు డిస్ట్రిబ్యూటరీ కాలువ వెడల్పును 50 మీటర్ల నుంచి 40 మీటర్లకు తగ్గించాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రాజెక్టు రూపకల్పనను సాంకేతికంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా తగిన నిర్ణయం తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.అనంతరం జూలూరుపాడు మండలం పడమటి నరసాపురం గ్రామంలోని గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, విద్యార్థినుల వసతి గదులు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, వంటశాలలో పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.పదో తరగతి విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడిన కలెక్టర్, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫాంలు, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.గత విద్యా సంవత్సరంలో పాఠశాల పదో తరగతి ఫలితాలు వంద శాతం నమోదయ్యాయని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ విద్యాసంవత్సరంలో కూడా అదే ఫలితాన్ని సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని బాధ్యతగా తీసుకుని, లోపాలు కనిపిస్తే వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ శ్రీనివాస్, సాగునీటి శాఖ అధికారులు, సర్వే అధికారులు, రైతులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికి విరుద్ధం:ఎస్.జె.కె. అహ్మద్

పాల్వంచ, జూలై 22 (సాక్ష్యం):



విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ, యువతకు న్యాయం చేయాలని శాంతియుతంగా ఆందోళన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.జె.కె. అహ్మద్ తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతును అరెస్టుల ద్వారా అణిచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం, వారికి మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్బంధ ధోరణికి నిదర్శనమని విమర్శించారు.విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలపై కేంద్ర ప్రభుత్వం దేశ యువతకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనల వల్ల నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని కోరారు.దేశ యువతకు న్యాయం జరిగే వరకు వారి హక్కులు, భవిష్యత్తు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలను విడనాడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని ఎస్.జె.కె. అహ్మద్ కోరారు.

## 108 అంబులెన్స్ సేవలు ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలి

- **ఆళ్లపల్లిలో అత్యవసర వైద్య వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా సమన్వయకర్త సతీష్**

ఆళ్లపల్లి, జూలై 22 (సాక్ష్యం):



ప్రజలకు అత్యవసర సమయంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న 108 అంబులెన్స్ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సమన్వయకర్త సతీష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న 108 అంబులెన్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అంబులెన్స్‌లో అత్యవసర చికిత్సకు అవసరమైన వైద్య పరికరాలు, ఔషధాల లభ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. రక్తపోటు పరీక్షించే పరికరం, స్టెతస్కోప్, గ్లూకోమీటర్, థర్మామీటర్, గుండెపోటు బాధితులకు ఉపయోగించే ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ (ఏఈడీ), ఆక్సిజన్ సిలిండర్, విషప్రయోగ బాధితులకు అవసరమైన అత్యవసర వైద్య పరికరాలు, స్ట్రెచర్, స్కూప్ స్ట్రెచర్, స్పైన్ బోర్డు, వీల్‌చైర్ తదితర పరికరాలను పరిశీలించి వాటి పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఆసుపత్రికి తరలించేంత వరకు అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందిస్తారని తెలిపారు. ఆధునిక జీపీఎస్ సాంకేతికత, ట్యాబ్ ఆధారిత వ్యవస్థ ద్వారా అంబులెన్స్‌ను వేగంగా సంఘటన స్థలానికి చేరవేస్తున్నామని చెప్పారు.ముఖ్యంగా రోడ్డు ప్రమాద బాధితులకు 'గోల్డెన్ అవర్'లో వైద్య సేవలు అందించడం అత్యంత కీలకమని, జీపీఎస్ ఆధారిత రూట్ మ్యాప్ ద్వారా 10 నుంచి 15 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకునేలా సేవలను సమన్వయం చేస్తున్నామని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ప్రజలు 108 అత్యవసర అంబులెన్స్ సేవలను అవసరమైన సమయంలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి మండలంలో 24 గంటల పాటు అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, సిబ్బందికి సేవల నాణ్యతపై అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించినట్లు తెలిపారు.ఈ తనిఖీలో అంబులెన్స్ పైలట్ సునీల్ కుమార్, అత్యవసర వైద్య సాంకేతిక నిపుణులు ఆకాశ్ శ్రీహర్ష, భాగ్యమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ లో చేరిన సిపిఎం మండల కమిటీ సభ్యుడు రామకృష్ణ

ఆళ్లపల్లి జులై 22(సాక్ష్యం):



గత ఎన్నో ఏళ్లుగా సిపిఎం పార్టీలో మండల కమిటీ సభ్యుడు కె.వి.పి.ఎస్ జిల్లా నాయకుడుగా పనిచేసిన మండల కేంద్రంలో మర్కోడు గ్రామానికి ముసల రామకృష్ణ బుధవారం హైదరాబాద్ తెలంగాణ రక్షణ సేవ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో పార్టీలో చేరామని అన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీలో పనిచేస్తానని పార్టీని బలోపేతం చేయడంలో ముందంజ ఉంటానని వారు తెలియజేశారు.

## కూరగాయల వ్యాపారిపై దాడి చేసిన మరో వ్యాపారి

- **పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు**

భద్రాచలం, జూలై 22(సాక్ష్యం):

భద్రాచలంలోని పాత కూరగాయల మార్కెట్‌లో బుధవారం పసుపులేటి శ్రీనివాస్ అనే కూరగాయల వ్యాపారిపై మరో కూరగాయల వ్యాపారి వినోద్ భౌతిక దాడి చేసారు. దీంతో శ్రీనివాస్ కుడికాలుకు స్వల్పగాయం కావడంతో ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పట్టణ పోలీసులకు శ్రీనివాస్ లిఖిత పూర్వక ఫిర్యాదు ఇచ్చారు. మరో వ్యాపారి వినోద్ గురించి పోలీసులు గాలిస్తున్నారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

- **బీజేపీ ఆధ్వర్యంలో నిరసన.. కాంగ్రెస్ తీరుపై విమర్శలు**

కొత్తగూడెం, జూలై 22 (సాక్ష్యం)

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ శ్రేణులు బుధవారం కొత్తగూడెంలో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశాయి. బీజేపీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీలో జరిగిన పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం వ్యవహరిస్తున్న తీరు పరిస్థితులను మరింత ఉద్రిక్తం చేసేలా ఉందని ఆరోపించారు. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులకు రాహుల్ గాంధీ మద్దతు ఇస్తున్నారని బీజేపీ భావిస్తోందని పేర్కొన్నారు. దేశంలో అల్లర్లు, ఉద్రిక్త పరిస్థితులు సృష్టించడం కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని విమర్శించారు. సమస్యలు ఏవైనా ఉంటే పార్లమెంట్, చట్టసభల్లో చర్చించి ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నిరసనల పేరుతో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించడం సమర్థనీయం కాదని వ్యాఖ్యానించారు. దేశ సమైక్యత, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు భారతీయ జనతా పార్టీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మోర్చా పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**గోదావరికి భారీ వరదలు సంభవిస్తే పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపై ఎంత మేరకు ఉంటుందనే ప్రశ్న మరోసారి చర్చనీయాంశంగా మారింది. 2022లో భద్రాచలం వద్ద నమోదైన చారిత్రక వరదలు ఇప్పటికీ ప్రజలను వెంటాడుతుండగా, భవిష్యత్తులో అంతకంటే తీవ్రమైన వరదలు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు ప్రాధికార సంస్థ, నీటిపారుదల శాఖ అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో అధ్యయనాలు చేపట్టడం ఈ అంశానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. బ్యాక్‌వాటర్ ప్రభావంపై సమగ్ర శాస్త్రీయ అధ్యయనం నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు, బ్యాక్‌వాటర్ ప్రభావం, భద్రాద్రిలో నెలకొన్న ఆందోళనలు, ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహాలపై ప్రత్యేక కథనం. ( భూక్యా రంజిత్ నాయక్ )**

# పోలవరం.. పెంచుతున్న భయం

- పోలవరం.. పెంచుతున్న భయం
- భారీ వరదలతో బ్యాక్‌వాటర్ ప్రభావంపై పెరుగుతున్న ఆందోళన
- 2022 వరద అనుభవాలు మళ్లీ ప్రజల్లో రేకెత్తిస్తున్న భయం
- భద్రాచలం ముంపుపై శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడించాలని డిమాండ్
- వరదల వేళ గోదావరి పరివాహక గ్రామాల భద్రతపై సందిగ్ధత
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాస్తవాలను ప్రజల ముందుంచాలని విజ్ఞప్తి
- పోలవరం పూర్తయితే భద్రాద్రిపై ప్రభావం ఎంతనే ప్రశ్నలు
- ముంపు ముప్పుపై స్పష్టత కోరుతున్న గోదావరి పరివాహక ప్రజలు







భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి
జూలై 22, (సాక్ష్యం)

భద్రాచలం ప్రజలు ఇప్పటికీ 2022 గోదావరి మహావరద జ్ఞాపకాల నుంచి పూర్తిగా కోలుకోలేదు. ఆ ఏడాది భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 71.3 అడుగులకు చేరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిని 18.3 అడుగులు దాటింది. దాదాపు 24.88 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. అనేక కాలనీలు, గ్రామాలు జలమయం కాగా రహదారి సంబంధాలు తెగిపోయాయి. వేలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ అనుభవాలు ఇంకా చెదరని వేళ, పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత భారీ వరదలు సంభవిస్తే బ్యాక్‌వాటర్ ప్రభావం ఎంత మేరకు ఉంటుందనే అంశంపై ప్రజల్లో మళ్లీ చర్చ మొదలైంది.

**» క్షేత్రస్థాయిలో అధికారుల అధ్యయనం //////**

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు ప్రాధికార సంస్థ, నీటిపారుదల శాఖ అధికారులతో కూడిన బృందం ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టింది. పోలవరం ప్రాజెక్టు ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి సంజీవ్ కుమార్, సభ్య కార్యదర్శి రఘురాం, ప్రధాన ఇంజనీరు రమేష్, ఇతర సాంకేతిక నిపుణులతో కూడిన బృందం బూర్గంపాడు, భద్రాచలం, దుమ్ముగూడెం, అశ్వాపురం మండలాల్లో పర్యటించింది. కిన్నెరసాని, ముర్రేడు వాగుల వద్ద వరదల సమయంలో ఎదురయ్యే ఎగపోటు పరిస్థితులను పరిశీలించింది. భద్రాచలం పట్టణంలోని ఎనిమిది స్లూయిస్‌లు, తూరుబాక వంతెన పరిసరాలు, అశ్వాపురంలోని భారీజల కర్మాగారం ప్రాంతాన్ని కూడా అధ్యయనం చేసింది. క్షేత్రస్థాయి పరిశీలనల అనంతరం తుది నివేదిక రూపొందించి ప్రభుత్వాలకు సమర్పించనున్నట్లు తెలుస్తోంది.

**» బ్యాక్‌వాటర్‌పై కొనసాగుతున్న సందేహాలు //////**

పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పని చేసే సమయంలో భారీ వరదలు సంభవిస్తే బ్యాక్‌వాటర్ ప్రభావం భద్రాచలం వరకు ఎంత మేరకు ఉంటుందనే విషయంపై ప్రజల్లో ఇప్పటికీ స్పష్టత లేదు. గోదావరిలో కలిసే ఉపనదులు, వాగులు, కాలువల నీరు వరదల సమయంలో సాఫీగా వెళ్లకపోతే లోతట్టు ప్రాంతాల్లో జలదిగ్బంధం ఏర్పడే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సందేహాలకు శాస్త్రీయ అధ్యయన నివేదికల ద్వారానే సమాధానం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**» స్లూయిస్‌ల భద్రతపై ప్రత్యేక దృష్టి //////**

భద్రాచలం పట్టణంలో వర్షపు నీరు వేగంగా గోదావరిలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఎనిమిది స్లూయిస్‌లు వరదల సమయంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో వాటి పనితీరు, నిర్వహణ, నీటి పారుదల సామర్థ్యాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాలంలో స్లూయిస్‌ల వద్ద నీరు నిలిచిపోవడానికి గల కారణాలు, అధిక సామర్థ్యం గల మోటార్ల ఏర్పాటు, శాశ్వత విద్యుత్ సదుపాయం కల్పించే అంశాలపై సాంకేతిక స్థాయిలో చర్చించినట్లు సమాచారం.

**» స్పిల్‌వే సామర్థ్యం... ప్రజల్లో ఆందోళన ///////**

పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే గరిష్ఠంగా 50 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేసే సామర్థ్యంతో నిర్మించబడింది. 2022లో నమోదైన 24.88 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం దాని సామర్థ్యంలో దాదాపు సగం మాత్రమే అయినప్పటికీ భద్రాచలం ప్రాంతం తీవ్ర ప్రభావానికి గురైంది. భవిష్యత్తులో అంతకంటే అధిక వరదలు సంభవిస్తే పరిస్థితి ఎలా ఉంటుందనే ప్రశ్న ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

**» యటపాక కరకట్టపై ఆందోళన //////**

ఆంధ్రప్రదేశ్‌లోని యటపాక కరకట్ట పరిధిలో ఉన్న స్లూయిస్‌లు, రక్షణ గోడల నిర్వహణ అంశాలను కూడా అధ్యయన బృందం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. గత వర్షాకాలంలో దెబ్బతిన్న రక్షణ గోడల మరమ్మతులపై వేగంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక అధికారులు సూచించినట్లు సమాచారం. కరకట్ట బలోపేతం కూడా భవిష్యత్తు వరదల సమయంలో కీలకమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**» శాస్త్రీయ అధ్యయనాలే స్పష్టతకు మార్గం //////**


బ్యాక్‌వాటర్ ప్రభావంపై సమగ్ర హైడ్రాలిక్ అధ్యయనం నిర్వహించి, వివిధ స్థాయిల వరదలకు అనుగుణంగా భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, అశ్వాపురం తదితర ప్రాంతాలపై ఉండే ప్రభావాన్ని ప్రజలకు వెల్లడించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎంత వరద ప్రవాహానికి ఎంత నీటిమట్టం నమోదవుతుంది, ఏ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది, ఎలాంటి రక్షణ చర్యలు అవసరమనే అంశాలను పారదర్శకంగా వెల్లడించాలని కోరుతున్నారు.

**» ప్రభుత్వాలు స్పందించాలన్న డిమాండ్ ///////**

కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు సమన్వయంతో అధ్యయన నివేదికలను ప్రజల ముందుంచి అపోహలను నివృత్తి చేయాలని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు. శాస్త్రీయ ఆధారాలతో వాస్తవ పరిస్థితిని వెల్లడించి, భవిష్యత్తు వరదలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధ్యయన బృందం సమర్పించే తుది నివేదిక భద్రాచలం పరిసర ప్రాంతాలపై బ్యాక్‌వాటర్ ప్రభావానికి సంబంధించి ప్రజల్లో నెలకొన్న అనేక సందేహాలకు స్పష్టత ఇవ్వడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణకు మార్గదర్శకంగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

**» వాస్తవాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి**

**( తమ్మలపల్లి వెంకటేశ్వర్లు ), కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు**




పోలవరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత భద్రాచలం, పరిసర ప్రాంతాలపై బ్యాక్‌వాటర్ ప్రభావం ఎంత మేరకు ఉంటుందనే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ ఆధారాలతో ప్రజలకు వివరించాలి. అపోహలకు తావు లేకుండా సమగ్ర నివేదికను బహిర్గతం చేసి, అవసరమైన రక్షణ చర్యలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

**» ప్రతి వరదతో వ్యాపారం దెబ్బతింటోంది**

**( కుంభంపాటి సురేష్ ), వ్యాపారి.**

2022 వరదల సమయంలో పట్టణంలోని అనేక దుకాణాల్లోకి నీరు చేరి లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. భవిష్యత్తులో భారీ వరదలు వస్తే పరిస్థితి ఎలా



ఉంటుందనే ఆందోళన ఇప్పటికీ ఉంది. బ్యాక్‌వాటర్ ప్రభావంపై స్పష్టత ఇవ్వడంతో పాటు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలి.

**» 2022 వరద అనుభవం ఇప్పటికీ మర్చిపోలేదు**

**( బండారు శరత్ బాబు , సిపిఎం పార్టీ నాయకులు )**



2022 వరదల్లో భద్రాచల పట్టణ వ్యాప్తంగా అనేక కుటుంబాలు ఇల్లు వదిలి సురక్షిత ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చింది. ఇంట్లోని సామగ్రి, పత్రాలు, గృహోపకరణాలు చాలా వరకు దెబ్బతిన్నాయి. ఇప్పటికీ భారీ వర్షాలు ప్రారంభమైతే అదే భయం గుర్తుకొస్తుంది. భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలి.

# ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా
- కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు
- నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైందని విమర్శ





కొత్తగూడెం, జూలై 22 (సాక్ష్యం)

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. అదే విధంగా రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి పిలుపు మేరకు స్థానిక పోస్టాఫీస్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బస్టాండ్‌కు చేరుకున్న కార్యకర్తలు బస్టాండ్ సెంటర్ లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన అంశమని అన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యే పరిస్థితులను కేంద్ర ప్రభుత్వమే సృష్టించిందని ఆరోపించారు. రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని అలాంటి హక్కును అణచివేసే ప్రయత్నాలు చేయడం తగదన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా మారిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విద్య, ఉపాధి, ధరల పెరుగుదల, రైతు సమస్యలు, నిరుద్యోగం వంటి ప్రధాన అంశాలను పక్కనబెట్టి ప్రజల దృష్టి మళ్లించే రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం విపక్షాలపై ఒత్తిడి తీసుకురావడం నిరసనలను అణచివేయడం వంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రజల హక్కుల పరిరక్షణ, విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ, కంచర్ల చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, జిల్లా కోశాధికారి వై. శ్రీనివాస్‌రెడ్డి, కొత్వల శ్రీనివాసరావు, బత్తుల వీరయ్య, మండే హనుమంతరావు, 16వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు సాయిరాజ్, కార్పొరేటర్లు, సర్పంచులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

- వారం రోజుల్లో ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- తాగునీరు నుంచి భవన అనుమతుల వరకు అన్ని సమస్యలకు ఒకే వేదిక
- ప్రజల సమస్యల పరిష్కారమే నగరపాలక సంస్థ లక్ష్యం
- కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత






కొత్తగూడెం, జూలై 22 (సాక్ష్యం)

కొత్తగూడెం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని నగర ప్రజలు, ముఖ్యంగా 60వ డివిజన్ ప్రజలు విస్తృతంగా సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ కోరారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ప్రజావాణి అత్యంత ఉపయోగకరమైన వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..నగర ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యను అధికారులు ప్రత్యక్షంగా స్వీకరించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పరిశీలించి సాధ్యమైనంత వరకు వారం రోజులలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య సమస్యలు, చెత్త తొలగింపు, డ్రైనేజీ సమస్యలు, ఆస్తి పన్నులు, నీటి పన్నులు, భవన నిర్మాణ అనుమతులు, పట్టణ ప్రణాళికకు సంబంధించిన అంశాలు, జనన–మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇతర మున్సిపల్ సేవలకు సంబంధించిన అన్ని రకాల సమస్యలను ప్రజావాణిలో నమోదు చేసుకోవచ్చని వివరించారు. ప్రజలు తమ సమస్యలను మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకురావాలని మేయర్ సూచించారు. ప్రజల వినతులను పెండింగ్‌లో ఉంచకుండా శాఖల వారీగా బాధ్యతలను నిర్ధారించి, నిర్దిష్ట గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ సుజాత మాట్లాడుతూ..ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలు, అవసరమైన పత్రాలు, ఆధారాలను జతచేసి వినతిపత్రాలు సమర్పిస్తే పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతంగా జరుగుతుందని చెప్పారు. అసంపూర్ణ వివరాలతో ఇచ్చే దరఖాస్తుల వల్ల ఆలస్యం జరిగే అవకాశముంటుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పౌర సేవలు అందించడమే కొత్తగూడెం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని కమిషనర్ తెలిపారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులకు పంపించి, దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రతి బుధవారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నందున నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొంటూ సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా ప్రజావాణిలో నమోదు చేయాలని కోరారు.



## కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష చేపట్టాలి: ఏఐటీయూసీ



ఇల్లందు , జూలై 22(సాక్ష్యం):

ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలను పునఃసమీక్షించి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఇల్లందు ఏరియాలోని కేఓసీ, జేకేఓసీ–5, ఏరియా వర్క్ షాప్, ఏరియా స్టోర్స్, ఎస్&పీసీ, ఏరియా సివిల్ విభాగాల వద్ద పెద్ద ఎత్తున కార్మికులు నిరసన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహించి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఆయా గని అధికారులకు అందజేశారు.ఏరియా వర్క్ షాప్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా సుమారు 2,000 మంది కార్మికులు ఏళ్ల తరబడి మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, కేవలం 120 మందికే బోర్డు నిర్వహించడం అన్యాయమని అన్నారు.అలాగే, మెడికల్ బోర్డుకు ఎంపికైన వారిలో 28 మంది కార్మికులకు సకాలంలో సమాచారం అందకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హాజరైన 120 మందిలో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్ కు అర్హులుగా ప్రకటించడం గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డులతో పోలిస్తే చాలా తక్కువ శాతమని పేర్కొన్నారు.బొగ్గు గనుల్లో, ముఖ్యంగా అండర్ గ్రౌండ్ లో దశాబ్దాలుగా పనిచే స్తున్న కార్మికులు కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, వారి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిగణనలోకి తీసుకోకుండా ఫలితాలు ప్రకటించడం వల్ల నిజంగా అర్హులైన కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే దరఖాస్తు చేసుకుని మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికులందరికీ తక్షణమే మరోసారి కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహించాలని, ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని నిష్పాక్షికంగా పరిశీలించి అర్హులైన వారిని ఇన్వాలిడేషన్ కు ఎంపిక చేసి, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించడం ద్వారా కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని కోరారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శులు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, వి. జయరాజు, జక్కుల శ్రీనివాస్, దాట్ల వెంకటేశ్వర్లు, పి. యుగేందర్, మంగపతి రావు, కలవల సిద్ధార్థ్, విజయ్ శ్రీనివాస్, గుగులోత్ కృష్ణ, చెరుకు సారయ్య, రావుజీ, బట్టు రవి, కొంటు వీరస్వామి, అమ్మ ఆంజనేయు లు, గుగులోత్ లక్ష్మణ్, నందకుమార్, ఆర్.ఎల్., విష్ణువర్ధన్, నిఖిల్ కుమార్ సాహూ, నగేష్, మహేష్, సోలం వెంకటేశ్వర్లు, మేఘరాజు, స్వరూప, గుగులోత్ సోని, లక్ష్మి, సంధ్యారాణి, సింధు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ అక్రమాలపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: ఎస్ఎఫ్ఐ

**భద్రాచలం, జూలై 22(సాక్ష్యం):** నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో చోటుచేసుకున్న అక్రమాలు దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని, ఈ పరిణామాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనా మా చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) భద్రాచలం పట్టణ కా ర్యదర్శి కొప్పుల రవీందర్ డిమాండ్ చేశారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు సంవత్సరాల తరబడి శ్రమించి సిద్ధమవుతున్నారని, అలాంటి పరీక్షల నిర్వహణలో లోపాలు చోటు చేసుకోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పూర్తి విశ్వాసం కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో పా రదర్శకత, జవాబుదారీతనం, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం కల్పి స్తూ పరీక్షల నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని కోరారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ ప్రశ్నపత్రాల భద్రత, పరీక్ష కేంద్రాల పర్యవేక్షణ, మూల్యాంకన ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే విధం గా ప్రవేశ పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని సూచించా రు.విద్యను వ్యాపార వస్తువుగా కాకుండా ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉం డే రాజ్యాంగబద్ధమైన హక్కుగా ప్రభుత్వం పరిరక్షించాలని ఎస్ ఎఫ్ ఐ డి మాండ్ చేసింది. ప్రేమ్ కుమార్, రాణి, సుజాత, నితిన్, అంజలి, దేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కోతుల బెడదకు చెక్ పెట్టాలి..!

- కుక్కల సంచారానికీ అడ్డుకట్ట వేయాలి
- 55వ డివిజన్ ప్రజల సమస్యలపై మేయర్‌కు కార్పొరేటర్ సింగర హరిహారన్ వినతి
- చిన్నారులు, మహిళలు భయాందోళనలో జీవనం
- 55వ డివిజన్‌లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి



కొత్తగూడెం, జూలై 22 (సాక్ష్యం)

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 55వ డివిజన్‌లో రోజురోజుకూ తీవ్రమవుతున్న కోతుల బెడదతో పాటు వీధి కుక్కల సంచారం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యల పరిష్కారానికి అత్యవసర చర్యలు చేపట్టాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ సింగర హరిహారన్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌కు వినతి పత్రం సమర్పించారు. డివిజన్‌లో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో అవి ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా ప్రజలపై దాడులకు కూడా పాల్పడుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. కోతుల భయంతో చిన్నారులు బయట ఆడుకునే పరిస్థితి లేకుండా పోయిందని మహిళలు, వృద్ధులు రోడ్లపై స్వేచ్ఛగా నడవడానికి కూడా భయపడుతున్నారని తెలిపారు. పలువురు కోతుల దాడులకు గురై గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని దీంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని వివరించారు. అంతేకాకుండా డివిజన్‌లో వీధి కుక్కల సంచారం కూడా రోజురోజుకూ పెరుగుతోందని గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కోతులు, కుక్కల సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సంబంధిత శాఖల సమన్వయంతో శాశ్వత పరిష్కారం చూపాలని మేయర్‌ను కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింగర హరిహారన్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి ఓటు వేసి గెలిపించిన ప్రతి కుటుంబానికి తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. 55వ డివిజన్‌లో కోతుల బెడద తీవ్రమైన సమస్యగా మారిందని ఈ అంశాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారం కోసం మేయర్ సహకారంతో ప్రత్యేక చర్యలు చేపట్టేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్న హరిహారన్ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, భద్రత కల్పించేందుకు నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు. కోతులు, వీధి కుక్కల సమస్యను అత్యవసరంగా పరిగణించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రజల భద్రత, ఆరోగ్యం దృష్ట్యా ఈ సమస్యపై ఆలస్యం చేయకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కోతులను పట్టుకునే చర్యలతో పాటు వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమాలను కూడా వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. 55వ డివిజన్‌లో నెలకొన్న ఈ సమస్యకు త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు మున్సిపల్ యంత్రాంగాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మైనర్ విద్యార్థినీ విద్యార్థులు డ్రైవింగ్ చేయడం నేరం

- ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు



భద్రాచలం టౌన్, జూలై 22 (సాక్ష్యం)

మైనరు విద్యార్థిని, విద్యార్థులు డ్రైవింగ్ చేయడం ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధమని, ఇందుకు బాధ్యులుగా వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. బుధవారం నాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలం నందు ట్రాఫిక్ రూల్స్ పైన, మైనర్ డ్రవింగ్, నెంబర్ లేకుండా డ్రైవింగ్ వంటి అంశాల పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో పలు కళాశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులు ఇష్టానుసారంగా అలాగే విద్యార్థులు మద్యం సేవించి మొబైల్ ఫోన్లలో మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా అతివేగముగా వెళ్లడం వలన చాలాచోట్ల ప్రమాదాలకు గురై విద్యార్థినీ, విద్యార్థులు గాయాలపాలవడం ప్రతిరోజు పత్రికలలో మనం చూస్తూ ఉన్నామని అన్నారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపడం నేరమని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైనర్ డ్రైవింగ్, మొబైల్ తో డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వలన అనుకోకుండా జరిగే ప్రమాదాలు వల్ల ఆ కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలు గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్ పీవోలు డాక్టర్ ఎం.కిరణ్ కుమార్, బి.సుధాకర్ రావు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యారిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిధి దాటి రక్తపరీక్షలు చేస్తే చర్యలు తప్పవు

- ప్రైవేటు రక్త పరీక్ష నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- రక్త పరీక్షా కేంద్రాలలో ప్రమాణాలు పాటించండి..

డా. తుకారం రాథోడ్.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి




**అశ్వారావుపేట, జూలై 22, సాక్ష్యం :** ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, తమ పరిధి దాటి పరీక్షలు నిర్వహించకూడదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ హెచ్చరించారు. బుధవారం వినాయకపురం ఆరోగ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు చెందిన ప్రైవేటు రక్త పరీక్షా కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త పరీక్షా కేంద్రాలలో నిర్ణీత ప్రమాణాలను పాటించాలని, సరైన అర్హతలు, అనుమతులు లేకుండా కేంద్రాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రక్తపరీక్ష కేంద్రాలలో నమోదయ్యే మలేరియా, డెంగ్యూ వంటి పాజిటివ్ కేసుల వివరాలను తప్పనిసరిగా సంబంధిత ప్రభుత్వ వైద్యశాఖ అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. రక్త పరీక్షలకు నిర్దేశించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు తెలిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. రోగుల ఆరోగ్యంతో చెలగాటమాడే ఎలాంటి అక్రమాలను సహించేది లేదని ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వహణలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు పాటించాలన్నారు. అనుమతించిన పరిధి దాటి రక్త పరీక్షలు చేయడం నిబంధనలకు విరుద్ధమని,జిల్లా వ్యాప్తంగా రక్త పరీక్షా కేంద్రాలలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే ల్యాబ్‌లపై సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా. రాందాస్ డా. నౌశీన్, డిపిఎమ్ఓ మోహన్, ఎస్ యుఓ వెంకటేశ్వరరావు, పలువురు హెల్త్ అసిస్టెంట్ లు, ప్రైవేట్ రక్త పరీక్షా కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత స్థానాల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ

కొత్తగూడెం టౌన్, జూలై 22 (సాక్ష్యం)



ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన ఘటనలకు సంబంధించి దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన అంశాలను సున్నితంగా పరిశీలించి, పిటిషన్‌ను స్వీకరించి న్యాయం చేయాలని కోరారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు విశ్వాసం మరింత బలపడేలా వ్యవహరించాలని, విద్యార్థులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.

## కేంద్ర ప్రభుత్వ వైఖరికి జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

భద్రాచలం టౌన్, జూలై 22 (సాక్ష్యం)

ఢిల్లీలో నీట్ పేపరు వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, జిల్లా కార్యదర్శులు రామ్మూర్తిలు మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ యువత భవిష్యత్తుతో ఆటలాడే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను అమలు చేయాలని కోరారు. చింత్రాల అరుణ్, ఎడారి ప్రదీప్, గాడి విజయ్, ఆకుల వెంకట్, మాచినేని భాను పాల్గొన్నారు.



## పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తున్న పాలకులు

- ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి



భద్రాచలం టౌన్, జూలై 22 (సాక్ష్యం)

ఉపాధ్యాయులను నియమించకుండా యూనిఫామ్ అందించకుండా పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసే కుట్రలు పాలకులు పొందుతున్నారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పట్టణ కార్యదర్శి డి సీతాలక్ష్మి ఆరోపించారు. బుధవారం ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీ కాలనీకి చెందిన యుపిఎస్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా సీనియర్ నాయకురాలు నాదెండ్ల లీలావతి అధ్యక్షతన జరిగిన సభలో డి సీతలక్ష్మి మాట్లాడుతూ 35 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలకి ఉపాధ్యాయుని కేటాయించకుండా డిప్టేషన్ ఉపాధ్యాయురాలితో తరగతి నిర్వహించడం సరైంది కాదని అన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనానికి సైతం నిధులు సరిపోవటం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. గతంలో కోడిగుడ్డుకి ఐదు రూపాయలు ఉన్న ధరనే నేటికీ కొనసాగించడంతో ఎనిమిది రూపాయలు పెట్టి కొనలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సీతాలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాలు లేక యూనిఫాం రాక ఉపాధ్యాయుల సమస్యతో చదువులు ఎలా సాగుతాయని సీతా లక్ష్మీ ప్రశ్నించారు. పటం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే ఇన్ని సమస్యలు ఉంటే ఏజెన్సీ గ్రామాలలో ఇంకెన్ని సమస్యలు ఉన్నాయోనని ఆమె సందేహాన్ని వ్యక్తం చేశారు. అయిదు ఆధ్వర్యంలో సమగ్ర సర్వేలు నిర్వహిస్తున్నామని ఈ సమస్యలపై భవిష్యత్తులో కార్యచరణ రూపొందిస్తామని సీత లక్ష్మి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 5వ సీనియర్ నాయకురాలు ఉస్తేల జ్యోతి డి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.